క్లుప్తంగా

ఎంపీని కలిసిన జూలెకల్ వాసులు



శాంతినగర్: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను వడ్డేపల్లి మండలం జూలెకల్ వాసులు ఆదివారం కలిశారు. జూలెకల్‌లోని ఆలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఎండోమెంట్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆలయ భూములను రక్షించాలని ఎంపీని కోరినట్లు బీజేవైఎం నాయకులు వెంకటేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎంపీ భరోసా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రాలయ మఠాధికారికి సన్మానం



మల్దకల్: మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠాలకు సంబంధించి మఠాధికారిగా ఎంపికైన మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు మధుసూదనాచారి దంపతులను సన్మానించారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు దీరేంద్రదాసు, రవిచారితో పాటు అరవిందరావు, బాబురావు, చంద్రశేఖర్‌రావు, మండల నాయకులు తాటికుంట చంద్రశేఖర్ రెడ్డి, పద్మారెడ్డి, పెద్దొడ్డి వీరారెడ్డి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రంగస్వామి, ఉరుకుందు, కృష్ణ, చక్రి, రాము, శివమ్మ, ధర్మన్న, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. 6 మందికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించి కేసు నమోదు చేశారు. నిబంధనలు పాటించని 60 మందిపై చలాన్లు వేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వీరన్న, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డ్వాక్రా భవనం



మల్దకల్: మండలంలోని ఎల్కూరులో డ్వాక్రా భవనం నిరుపయోగంగా ఉంది. 14ఏళ్ల క్రితం రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనం చెరువు సమీపంలో ఉండటంతో మహిళలు వినియోగించడం లేదు. దీంతో భవనం నిరుపయోగంగా మారింది. భవనం చుట్టు కంపచెట్లు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన డ్వాక్రా భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి డ్వాక్రా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సద్దలోనిపల్లి రోడ్లకు మరమ్మతు చేయండి



మల్దకల్: గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని సద్దలోనిపల్లి వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారిందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై గుంతల వల్ల రాత్రివేళలో వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

హైమాస్ట్ వెలుగులు



అయిజ: మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో పంచాయతీ రాజ్ శాఖ వారు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ స్కీం ద్వారా నిధులు మంజూరు చేసి లైట్లను అమర్చారు. మున్సిపాలిటీలోని తనగలగేరి, కమ్మెళ్ల గేరి, పాత బిల్డింగ్ కాలనీ, అంగన్‌వాడీ కేంద్రం వద్ద అధికారులు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి హైమాస్ట్ లైట్లు వెలుగులు విరజిమ్మడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?



ఎర్రవల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- దోమల నివారణకు చర్యలు శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎర్రవల్లిలో స్వైర విహారం చేస్తున్న పందుల గుంపు

ఎర్రవల్లి: పల్లెల్లో ముసురు వర్షాల వల్ల ఇళ్ల మధ్య, పరిసర ప్రాంతాల్లో మురుగు కుంటలుగా చేరి దోమలు, క్రిమికీటకాలకు నిలయంగా మారాయి. ఆయా కాలనీలలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు ముందు జాగ్రత్తగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లి, బీచుపల్లి, ఇటిక్యాల, పుటాన్‌దొడ్డి, యాక్తాపురం, సాసనూలు, దువాసిపల్లి, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించింది. గతంలో పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పలు కార్యక్రమాలు నిర్వహించినా, సమస్యలు తీరలేదు. ఆయా గ్రామాల్లో మురుగు రోడ్లపైనే పారుతోంది. డ్రెయినేజీలు ఉన్నా వాటిని పంచాయతీ కార్మికులు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా పంచాయతీ కార్యదర్శులు గానీ, ప్రత్యేక అధికారులు గానీ స్పందించి దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఫాగింగ్, బ్లీచింగ్ జాడేలేదు..

కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమలు గుడ్లుపెట్టి విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు ఆయా గ్రామాలలోని పలు కాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనివల్ల కాలనీల్లో ఫాగింగ్ మిషన్ వినియోగించకపోవడంతో దోమలు, ఈగలు మరింత ఉధృతమవుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ సక్రమంగా వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలతో సతమతమవుతున్నాం..



ఎర్రవల్లి మండల కేంద్రంలోని షేకుపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు రోడ్లపై పారుతోంది. మురుగు కుంటలుగా ఏర్పడటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా సమస్యను పరిష్కరించాలి.

– తెలుగు వీరేష్, ఎర్రవల్లి

నివారణ చర్యలు చేపడుతున్నాం



గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలకు బదులుగా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో ఫాగింగ్ చేపడుతాం. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

– అజార్ మొహియుద్దీన్, ఎంపీడీఓ, ఇటిక్యాల

చదువుతోనే పేదరికాన్ని రూపుమాపవచ్చు



విద్యార్థినిని సత్కరిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: చదువుకోవడానికి పేదరికం అడ్డు కాదని, కష్టపడి చదువుకుంటేనే పేదరికాన్ని రూపుమాపవచ్చని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మల్దకల్ మండలం అమరవాయికి చెందిన రూబిక జాతీయ అగ్రికల్చర్ ఐకార్ విభాగంలో 383ర్యాంకు సాధించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రూబికను ఆమె శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకొని విద్యార్థులు చదివి భవిష్యత్‌లో ఉన్నతమైన ఉద్యోగం సాధించాలని, అప్పుడే జీవిత సంకల్పానికి నిదర్శనంగా ఉంటుందన్నారు. విద్యార్థిని రూబిక జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పెద్దొడి రామకృష్ణ, గోపాల్ తదితరులు ఉన్నారు.

చిన్నోనిపల్లి నిర్వాసితులను ఆదుకోవాలి



చిన్నోనిపల్లి నిర్వాసితులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గట్టు: చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డిలు డిమాండ్ చేశారు. ఆదివారం చిన్నోనిపల్లి గ్రామాన్ని, పునరావాస కేంద్రాన్ని వారు సందర్శించారు. పునరావాస కేంద్రంలో సరైన మౌలిక వసతులు కల్పించలేదని, ముంపు గ్రామస్తులకు పునరావాస కేంద్రంలోకి మారేందుకు రవాణా ఖర్చులు చెల్లించలేదన్నారు. 18 ఏళ్ల క్రితం ముంపు గ్రామాన్ని గుర్తించి, అప్పట్లో గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ప్రస్తుతం 18 ఏళ్లు పైబడిన వారు చాలా మంది ఉన్నా, వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. మిడ్‌మానేరు, వట్టెం ముంపు బాధితులకు ఇచ్చినట్లు రూ.12.50లక్షలను చిన్నోనిపల్లి నిర్వాసితులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ రామాంజనేయులు, బీజేవైఎం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తరుణ్, బలిగేర శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాలు పూర్తిచేయాలి

గద్వాల: దేశంలోనే భారతీయ జనతా పార్టీకి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోందని, స్వచ్ఛందంగా ప్రజలు పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గద్వాలలో పార్టీని మరింత బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరు సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

బీజేపీకి ఆదరణ పెరుగుతోంది

అయిజ: బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బింగుదొడ్డిలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ కుమార్, నాగన్న, లక్ష్మన్న, తిరుమలేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ డైరెక్టర్‌పై కేసు నమోదు

గద్వాల క్రైం: ఓ ప్రైవేట్ స్కూల్ డైరెక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వీరాపురంలో అద్దె భవనంలో ఉంటున్న స్వర్ణ కమలాకర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ కార్యాలయ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన భార్య సైతం మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో తన భార్యను కలిసేందుకు ఈ నెల 9న పాఠశాల వద్దకు వెళ్లాడు. ఆ పాఠశాల డైరెక్టర్ కె రాముడు ఇరువురి వివాహానికి సంబంధించిన పత్రాలు చూపించాలని స్వర్ణ కమలాకర్‌ను ప్రశ్నించాడు. ఈ క్రమంలో వివాహానికి సంబంధించిన ధ్రువపత్రాలను సదరు వ్యక్తి అందజేశారు. అయినప్పటికీ తన భార్యను కలిసేందుకు అను మతి ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. క్షణికావేశంతో డైరెక్టర్ స్వర్ణకమలాకర్‌పై దాడి చేశాడు. భార్యను ఇంటికి పంపకుండా దాడి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో (ఈ నెల14న) శనివారం రాత్రి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై 'సాక్షి' సంబంధిత డైరెక్టర్‌ను వివరణ కోరగా, మహిళా ఉపాధ్యాయురాలు పాఠశాలలో చేరిన సమయంలో వివాహం కాలేదని ధ్రువపత్రాలు అందించినట్లు తెలిపారు. దీంతో వారి వివాహ అంశాలను కమలాకర్‌ను అడగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో చెంపపై కొట్టిన మాట వాస్తవమేనని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన కోలుబాయి బతుకమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రామాపురంలో గణేశుని శోభాయాత్రలో పాల్గొన్న యువకులు, భక్తులు



క్యాతూర్‌లో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఏకదంతుడి నిమజ్జనం

- ఘనంగా శోభాయాత్ర
- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన
- మండపాల వద్ద లడ్డు వేలం, అన్నదానం

సాక్షి, నెట్‌వర్క్: అలంపూర్‌లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ఆదివారం ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని సన్నిధిలో చిన్నారి జ్యోషిక నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. మహిళలు ఒకే రకమైన చీరలు ధరించి చేసిన నాట్య ప్రదర్శన అలరించింది. క్యాతూర్ వినాయకుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు. లడ్డు వేలం వేయగా రూ.4వేలకు వెంకట సుబ్బయ్య దక్కించుకున్నారు. అక్బర్‌పేటలో లడ్డును కుసుపాటి కామేశ్వర్‌రెడ్డి, కుసుపాటి మానిక చౌదరిలు రూ.28 వేలకు దక్కించుకున్నారు.

- మానవపాడు మండలంలోని జల్లాపురం, మానవపాడు, నారాయణపురం గ్రామాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. నృత్యాలు, కోలాటం, భక్తి పాటలతో ఊరేగింపు నిర్వహించారు.
- వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరు సోదరభావంతో ఉండాలని తెలిపారు.



చింతలకుంటలో లడ్డుతో భక్తులు

- కేటీదొడ్డి, చింతలకుంట, నందిన్నె, కుచినెర్ల, పాత పాలెం గ్రామాల్లో వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. లడ్డు వేలం నిర్వహించగా చింతలకుంటలో గురుస్వామి రూ.36,500 లకు దక్కించుకున్నారు.
- శాంతినగర్‌లోని రామాలయంలో వినాయకుడు, రామాపురంలో చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో లంబోదరుని శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. భజంత్రీలు, డప్పులు, బాణా సంచా శబ్దాల మధ్య గణేశుని శోభాయాత్ర కొనసాగింది. రామాపురం పత్తి వెంకట్రాముడు రూ.13,600, 10వ వార్డు కౌన్సిలర్ రూ.13,800లకు లడ్డు కైవసం చేసుకున్నారు.



ఉండవెల్లిలో నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు

- ఉండవెల్లి మండలంలోని గ్రామాల్లో వినాయకుని నిమజ్జనలు నిర్వహించారు. అనంతరం తుంగభద్ర నది తీరానికి, కృష్ణా నది తీరానికి నిమజ్జనానికి భక్తులు తరలించారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఎర్రవల్లి: మండల కేంద్రానికి చెందిన ఉప్పరి తిరుమలేష్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గద్వాల పట్టణంలో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. అనంతరం తిరుమలేష్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట సుదర్శన్‌రెడ్డి, పరిపూర్ణ, రాగన్న, రాజు, లోకారెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పాటుపడదాం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది షఫీవుల్లా

గద్వాల అర్బన్: గద్వాలలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు, పార్కులు, పబ్లిక్ ప్రాపర్టీస్ పరిరక్షణకు పాటుపడదామని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణంలోని కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గద్వాలలో పార్కులు, మైదానాలు, ఆటస్థలాలు, చెరువులు, కుంటలు, కాల్వలు, ఆయా వీధులను అనుకొని ఉన్న గ్రామకంఠ సామూహిక స్థలాలు, నూతనంగా ఏర్పడిన కాలనీల్లో నిబంధనల ప్రకారం పార్కుల కొసం వదిలిన పదిశాతం స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. వాటి పరిరక్షణకు అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామన్నారు. భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల నిర్వాహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా రామలింగేశ్వర కాంళ్లే, కో కన్వీనర్లుగా నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఆర్ మోహన్, అక్బర్ బాష, న్యాయ సలహాదారులుగా న్యాయవాది కొండారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఇతర సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో మోహన్‌రావు, మధుసూదన్ బాబు, అతిఖుర్ రహ్మాన్, న్యాయవాది షఫీవుల్లా, తదితరులు ఉన్నారు.

జీవాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు



మేకలు, గొర్రెల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న డాక్టర్ పుష్పలత

శాంతినగర్: గొర్రెలు, మేకల పెంపకందారులు జీవాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని శాంతినగర్ పశు సంవర్ధక శాఖ డాక్టర్ పుష్పలత సూచించారు. వడ్డేపల్లి పట్టణంలోని శాంతినగర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో మేకలు, గొర్రెల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో పాడి పశువులు, గేదెలు ఉన్న రైతుల పశువులకు సంబంధించి కృత్రిమ గర్భధారణ కోసం పశుసంవర్ధకశాఖ ద్వారా ఈనెలలో రా యితీపైన ఎద సూదులు చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టాయన్నారు. గేదెల సంఖ్య పెరగడంతో పాలదిగుబడి పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎద సూది పూర్తి ధర రూ.675 ఉంటుందని, సబ్సిడీ రూ.425 పోగా, రూ.250 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొదటిసారి ఎద సూదికి రూ.250 చెల్లించి వేయిస్తే కట్టకుంటే రెండోసారి రూ.250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండుసార్లు ఎదసూది (సెమెన్) వేయించినా గేదె కట్టుతప్పకపోతే రెండు విడతలు రైతులు చెల్లించిన రూ.500 ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. ఈనెలంతా ఎదసూదులు చేస్తామని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో చెత్త తొలగించిన రైతులు



చెత్తను తొలగిస్తున్న రైతులు

కేటీదొడ్డి: మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి డిస్ట్రిబ్యూటర్ కాల్వల ద్వారా వస్తున్న నీరు మూడు రోజుల నుంచి నందిన్నె శివారు వరకు రాకపోవడంతో ఆదివారం రైతు లు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గమ నించిన రైతులు కొండాపురం, గువ్వలదిన్నె శివారులోని కాల్వలో పేరుకుపోయిన చెత్త, పా కరను స్వయంగా కాల్వలోకి వెళ్లి తొలగించా రు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా కాల్వలో ఉన్న చెత్తాచెదా రం తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని రవీంద్రభారతి ఉన్నత పాఠశాల 1997–98లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 26 ఏళ్ల తర్వాత ఒక చోట చేరి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హనుమంతు, శాస్త్రీ, ప్రభాకర్, చిన్న వెంకన్న, యుగంధర్‌లను ఘనంగా సన్మానించారు.

ఘనంగా మిలాద్- ఉన్- నబీ ఉత్సవాలు

అమరచింత: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్- ఉన్- నబీ ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గంధోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని మసీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం నబీసాబ్ మసీదులో పిండివంటలతో పాటు పాయసాన్ని నైవేద్యంగా భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. సోమవారం ఆసర్ ముబారక్ ద్వారా మహ్మద్ ప్రవక్తకు సంబంధించిన కేశాలను ప్రదర్శనగా ఉంచుతున్నట్లు వెల్లడించారు.

నాస్తిక అధ్యయన తరగతులకు..

అమరచింత: శాస్త్రీయ అధ్యయనం భావవాదం భావాజాలంపై ఆదివారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో నిర్వహించే నాస్తిక అధ్యయన తరగతులకు పట్టణం నుంచి నాస్తిక సమాజం నాయకులు ఆదివారం బయలుదేరారు. తరలినవారిలో విజయరాములు, భక్తరాజు, లక్ష్మీనారాయణ, రవీందర్, కుతుబ్, రఘు తదితరులు ఉన్నారు.